క్లుప్తంగా

మరో 300 మందికి ఇళ్ల పట్టాలు



పనులను పరిశీలిస్తున్న ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: డంపింగ్ యార్డ్ వద్ద మరో 300 మందికి ఇళ్ల పట్టాల పంపిణీకి భూమి కొనుగోలు చేశామని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ తెలిపారు. వీటిని కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. రొంపిచెర్ల గ్రామ సచివాలయం–2 పరిధిలోని గానుగచింత రోడ్డులోని లేఅవుట్‌లో రోడ్డు పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. 270 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశామని తెలిపారు. కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, సర్వేయర్లు అఖిల్, కమల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ శాస్త్రి

రొంపిచెర్ల: మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి అన్నారు. ఆయన బుధవారం రొంపిచెర్లలో మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయించాలని సూచించారు. స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రొంపిచెర్లలో అనధికరంగా రెండు మద్యం బార్లు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐకు కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు, లోకనాథం, సూపర్‌వైజర్లు సురేషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే మైనారిటీలకు గుర్తింపు

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ముస్లి మైనారిటీలకు తగిన గుర్తింపు వచ్చిందని మండల సచివాలయ కన్వీనర్ ముర్వత్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులకు పడే అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించి ఆదుకోవడం ముస్లింలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ అభిమానానికి ముస్లింలందరూ ఆయనకు రుణ పడి ఉందామన్నారు. ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో గెలిపిద్దామన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లి: మండలంలోని 29 ఏ చింతమాకులపల్లెలో బుధవారం అత్తతో గొడవ పడి కోడలు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన భాస్కర్ భార్య రవళి(23) అత్త పద్మావతితో ఇంటి వద్ద గొడవ పడింది. మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న పురుగు మందును తాగింది. అపస్మారస్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికు తరలించారు. కాగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న తిమ్మారెడ్డి

సదుం: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేయాలని సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సచివాలయాల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి తెలిపారు. చెరుకువారిపల్లె, జోగివారిపల్లె పంచాయతీ పరిధిలోని గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు మంజూరు కాని వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షాఫిరెడ్డి, జ్యోతిరెడ్డి, బొమ్మల్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

సోమల: బాలిక అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మునిప్రసాద్ బుధవారం తెలిపారు.వివరాలు..మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లెకు చెందిన బాలిక బహిర్భూమికని చెప్పి వెళ్లి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జగనన్నతోనే పారదర్శక పాలన

- గడప గడపలో సంక్షేమ కాంతులు
- నాలుగేళ్లలో ఒక్కో ఇంటికి రూ. లక్షల్లో లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: సంక్షేమ పథకాలు గడప గడపకు అందుతున్నాయని, గడిచిన నాలుగేళ్లలో ఒక్కో ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే పథకాల లబ్ధి అందేలా జగనన్న పారదర్శక పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. మరిన్ని పథకాలు రావాలన్నా, జవాబుదారీ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని బలపరచాలని కోరారు. బుధవారం పసుపత్తూరు గ్రామ సచివాలయ పరిధిలోని మార్జేపల్లి, వీరశెట్టిపల్లి, దొమ్మిరిండ్లు, పసుపత్తూరు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రజలతో మమేకమయ్యారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగింది. పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. ఇంకా పథకాలకు అర్హత కలిగిన లబ్ధిదారులు ఉంటే గుర్తించాలని సచివాలయ సిబ్బందిని, ప్రజలు విన్నవించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ సభ్యురాలు కస్తూరమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, పురుషోత్తం, రెడ్డెప్పరెడ్డి, చిన్నరెడ్డెప్ప, చంద్రారెడ్డి, రవి, తహసీల్దార్ అమర్నాథ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలు ప్రారంభోత్సవాలు

పసుపత్తూరులో నూతనంగా నిర్మించిన ఆర్‌బీకే భవనం, మినీ హెల్త్ సెంటర్ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. దొమ్మిరిండ్లు గ్రామంలో జేజేఎం గ్రాంట్స్ ద్వారా రూ.5 లక్షలతో నూతనంగా వేసిన తాగునీటి బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. సమస్య తెలిపిన వెంటనే పరిష్కరించి తమ దాహార్తిని తీర్చినందుకు ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రైతుల అవసరమైన అన్ని సేవలు స్థానికంగానే లభిస్తాయని పేర్కొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రామకుప్పం అభివృద్ధికి మరిన్ని నిధులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: రామకుప్పం అభివృద్ధికి అడిగిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అదనపు నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. తాము నిధులు కావాలని కోరిన వెంటనే సీఎం సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. బుధవారం రామకుప్పం మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. వైఎస్సార్ సర్కిల్, కోదండ రామనగర్ కాలనీలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రామకుప్పం టౌన్‌లో సిమెంటు రోడ్లు వేయాలని స్థానికులు కోరగా వారం రోజుల లోపు నాలుగు వీధుల్లో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభమవుతాయన్నారు. అన్ని వీధుల్లో సిమెంటు రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. జగనన్న లే అవుట్‌లో త్వరితగతిన ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి మౌలిక సదుపాయాలను కల్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇళ్ల స్థలాలు కోసం ఆన్‌లైన్‌లో అధికంగా దరఖాస్తులు రావడంతో అదనంగా మరో లే అవుట్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. అనంతరం పథకాల లబ్ధిని అంకెల సహా ఆయన లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ మైనారిటీ నేత ముబారక్ వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ మురళీకృష్ణ, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, వార్డు సభ్యులు జమీను ప్రసాద్, అబ్దుల్, నేతలు సైఫుల్లా, జబీవుల్లా, తజ్‌ముల్ పాషా, వెంకటాచలపతి, శంకర్, యశ్వంత్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, తబ్రోజ్ బాషా, అధికారులు పాల్గొన్నారు.

జాతర ఆదాయం రూ.8.06 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పలమనేరు: పట్టణంలో శ్రీతిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఆలయానికి రూ.8.06 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ నరేష్ తెలిపారు. బుధవారం అధికారులు, కమిటీ సభ్యులు, పట్టణపెద్దల సమక్షంలో గంగమ్మ ఆలయంలో హుండీ కానులను లెక్కించారు. సారెలు, సేవా టిక్కెట్లు, హుండీ ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండి, విదేశీ డాలర్ల ద్వారా రూ.8.06 లక్షలు లభించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ దఫా ఎక్కువగానే ఆదాయం వచ్చినట్టు తెలిపారు కమిటీ సభ్యులతో కలసి ఆలయ చైర్మెన్ నరేష్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూ లేనంతగా లక్షలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఆలయంలో ప్రతి భక్తుడు అమ్మవారిని బాగా దర్శించుకోవాలనే లక్ష్యంతో ఆపకుండా వదలడంతో కొందరు హుండీ వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడంలో పట్టణ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది, ప్రజలకు, మీడియాకు కృతజ్ఞతలను తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డెప్ప రెడ్డి, మంజుల సుబ్రమణ్యం, కృష్ణవేణి గోవిందప్ప, ప్రసాద్ రెడ్డి, వేణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా తిరుపతి గంగమ్మ జాతర



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి



ఆలయ కమిటీకి విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: కుప్పం పట్టణంలోని శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరను కట్టుదిట్టంగా నిర్వహించాలని కుప్పం ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం అన్నిశాఖల అధికారులతో పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన జాతర కావడంతో నిర్వహణకు అన్నిశాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. మూడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గురువారం నుంచి జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతరలో ప్రధానంగా సోమవారం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, పచ్చగెరిగ , మంగళ, బుధవారాల్లో శిరస్సు ఊరేగింపు సందర్భంగా అదనపు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు సైతం పోలీసులకు సహకరించి జాతరను విజయవంతం చేయాలని కోరారు. సీఐ శ్రీధర్, ఎస్‌ఐ శివకుమార్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రూ.3 లక్షల విరాళం

జాతర నిర్వహణ కోసం ఎమ్మెల్సీ భరత్ రూ.3 లక్షలను విరాళంగా ఇచ్చారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని దర్శించుకుని పాలకవర్గ చైర్మెన్ మంజునాథ్‌కు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి జాతర ప్రజలదని, పార్టీలకతీతంగా జాతర విజయవంతానికి సహకరించాలని కోరారు.

విద్యుద్దీప కాంతులు

జాతరలో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గురువారం నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి విద్యుద్దీపాల భారీ కటౌట్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లు కాంతులీనున్నాయి.



ఆలయ ప్రాంగణంలో విద్యుత్ కాంతులు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పలు శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం ఉండ కూడదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరిగతిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులను సత్వరం చెల్లించాలని, అవసరమైన వారికి గృహ నిర్మాణాల కోసం రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీఓ మహేష్, హౌసింగ్ ఈఈ, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇన్‌సెంటివ్ ఇవ్వాలి

పలమనేరు: పట్టు పరిశ్రమశాఖ పెండింగ్ ఇన్‌సెంటివ్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గంలోని పట్టురైతులు బుధవారం స్థానిక పట్టుగూళ్ల విక్రయ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు ప్రోత్సాహంగా కిలో పట్టుగూళ్లకు రూ.50 ఇస్తున్నారన్నారు. గత 19 ఏళ్లుగా సాగుతున్న ఇన్‌సెంటివ్ పంపిణీ 2018 నుంచి ఆగిందన్నారు. ఈ ప్రాంతంలోనే రూ.ఏడు కోట్ల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో పాటు మల్బరీ షెడ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు ఆలస్యమవుతున్నాయన్నారు. పట్టురైతులతో ఆశాఖ కమిషనర్ సమావేశాలు లేవని, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు లేక రైతులకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. పట్టు రైతులు ఏడూరు గురుమూర్తి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలమనేరులో గడప గడపకు

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు పాతపేటలో ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొననున్నారు. అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ అభివృద్ధిని వివరించడంతో పాటు సమస్యలను తెలుసుకుంటారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

10 లోపు నాడు–నేడు పూర్తి చేయాలి



సూచనలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వెంకటరమణారెడ్డి

చౌడేపల్లి: పాఠశాలల్లో నాడు–నేడు పనులను జూన్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి సూచించారు. బుధవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో హెచ్‌ఎంలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలను బడిలో చేర్పించాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి స్కూలులో చేర్పించాలన్నారు. ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన వారుంటే ఫీజు కట్టించి ఓపెన్ స్కూల్‌లో చేరేలా చైతన్యం కల్పించాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంపై పలు సూచనలు చేశారు. పిల్లలకు ఐరన్ ఫోలిక్ ట్యాబ్లెట్స్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఎంఈఓ కేశవరెడ్డి, ఎస్‌ఎస్‌ఏ ఏఈ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

వేసవి ఎండలు తడాఖా చూపిస్తున్నాయి. ఇంటి నుంచి ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. సూర్యప్రతాపానికి జిల్లాలో చల్లని ప్రాంతంగా పేరొందిన పేదవాని ఊటీ పలమనేరు అట్టుడుకుతోంది. సాయంత్రం ఆరు దాటినా వేడి గాలుల తీవ్రత కొనసాగుతోంది.

- వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు
- భగభగమంటున్న పేదవాని ఊటి
- ఎండలో తిరిగితే వడదెబ్బ తప్పదు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

తేదీ	వారం	ఉష్ణోగ్రత (డిగ్రీలు)
11	గురువారం	39
12	శుక్రవారం	40
13	శనివారం	40
14	ఆదివారం	41
15	సోమవారం	42
16	మంగళవారం	41
17	బుధవారం	41



నిర్మానుష్యంగా పలమనేరు అంబేడ్కర్ సర్కిల్



పలమనేరు: వారం రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 8 గంటల నుంచి సూర్యుడు విరుచుకుపడుతున్నాడు. పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిప్పులు కురిపిస్తుండడంతో వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గరిష్టంగా పగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 23 డిగ్రీలకు తగ్గడం లేదు. ఎండదెబ్బకు జనం ఇంటి నుంచి కాలు బయటకు పెట్టాలంటే భయపడుతున్నారు. భవన నిర్మాణ, వ్యవసాయ కూలీలు, సంస్థల్లో పనిచేసే కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఎండలో తిరిగేవారు, పనిచేసే వారి శరీరంలో నీరు కోల్పోవడంతో డీ హైడ్రేషన్ కారణంగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంటుంది. ఎండ నుంచి ఉపశమనం కోసం చిట్కాలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు ఎండలో వెళ్లకూడదని పేర్కొంటున్నారు. పనుల విషయమై తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ ధరించాలని, ఎక్కువగా నీరు తాగాలని, వేసవి తాపన్ని తగ్గించే చల్లని పానీయాలు తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



“ ఎండలో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే టోపీ.. గొడుగు లేదా తలపాగా ధరించాలి. కళ్లకు కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవడం మేలు. కూలీలు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల దాకా ఎక్కువ ఎండలో పనులు చేయకూడదు. ఉదయం 6నుంచి 11 వరకు, మధ్యాహ్నం 4గంటల నుంచి 6 వరకు పని చేయాలి. నీటితో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలులాంటివి తీసుకోవాలి. ఉదయం శరీరానికి చలువ చేసే రాగి జావా తీసుకోవాలి. ఇది వేసవి తాపానికి విరుగుడు.

మల్లికార్జున రెడ్డి, మండలవైద్యాధికారి, పలమనేరు

చల్లటి పానీయాలు ఎంతో మేలు



పది కప్పుల పుచ్చకాయల గుజ్జు, చెక్కు తీసిన అల్లం ముక్కలు ఓ కప్పు వేసి జ్యూస్‌గా తయారు చేసుకోవచ్చు. ద్రాక్ష, దానిమ్మ రసాల్లో చక్కెర వేసుకొని ఫ్రిడ్జ్‌లో కొంతసేపు ఉంచి సేవించాలి. ఇది డయేరియా నివారణకు ఉపయోగపడుతుంది. మంచినీళ్లను బాగా తాగాలి

రజిని, ఆయుర్వేద వైద్యాధికారి, పలమనేరు

బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లకు స్థలం కేటాయింపు



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న తహసీల్దార్

రామకుప్పం: మండలంలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సెల్ టవర్‌ల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించినట్లు తహసీల్దార్ మురళి తెలిపారు. బుధవారం భూముల కేటాయింపు ప్రొసీడింగ్ కాపీలను తహసీల్దార్ కార్యాలయంలో బీఎస్‌ఎన్‌ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో గాంధీనగరం, ఆరిమానుపెంట, ననియాల, వెంకటాపురం, మణీంద్రం, గురుకులమడుగు, విజలాపురం గ్రామాల్లో ఒక్కొక్క సెల్ టవర్‌కు 0.05 సెంట్ల చొప్పున భూమిని కేటాయించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్రలతో దాడి.. ముగ్గురికి గాయాలు

రొంపిచెర్ల: మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని బోనంవారిపల్లెలో మంగళవారం రాత్రి ముగ్గురిపై ప్రత్యర్థులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బొమ్మయ్యగారిపల్లెకు చెందిన కరుణాకర్ భార్య విశాలకు బోనంవారిపల్లె వద్ద భూమి ఉంది. ఈ భూమి తనదేనని పెద్దగొట్టిగల్లుకు చెందిన విజయకుమార్‌రెడ్డి గతంలో ఆక్రమించుకున్నారు. దీనిపై విశాల కోర్టులో కేసు వేశారు. ఆమెకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో ఈ భూమిలో మామిడి మొక్కలు నాటారు. అక్కడే నివాసం ఉండేదుకు రేకుల షెడ్ వేసుకుంటున్నారు. దీంతో వారిపై పగ పెంచుకున్న విజయకుమార్‌రెడ్డి మంగళవారం రాత్రి తన అనుచరులతో వచ్చి రేకుల షెడ్‌ను కూల్చివేసి, మామిడి చెట్లను రొటోవేటర్‌తో దున్నేశాడు. విషయం తెలుసుకున్న విశాల బంధవులు శాంతమ్మ, భర్త రామచంద్ర, కుమారుడు శ్రీనాథ్‌తో కలసి వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ముగ్గురిపై కట్టెలతో దాడి చేసి కాళ్లు, చేతులు విరిచేశారు. వారిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. దాడిలో ద్విచక్ర వాహనం కూడా దెబ్బ తింది. బాధితురాలు శాంతమ్మ కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు రొంపిచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధ శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు తిరుమంజనం నిర్వహించడం పరిపాటి. స్వామివారి ఆలయం చుట్టు పరివార దేవతలు, ధ్వజస్తభం, రాహుకేతు మండపాలను శుద్ధి చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.